క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి గరుడ వాహన సేవ


గరుడ వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవీ భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారు శుక్రవారం రాత్రి మాడ వీధుల్లో గరుడ వాహనంపై వైభవంగా ఊరేగారు. రాత్రి ఏడు గంటల నుంచి స్వామి వారు గరుడ వాహన సేవ ప్రారంభమైంది. విశేషంగా భక్తులు సేవలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. గోవింద నామాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం


సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ అనంత ఉమా మహేశ్వరరావు

పెరవలి: ఉపాధి హామీ పథకం ద్వారా పెరవలి మండలానికి మంజూరైన రూ.3.17 కోట్ల వ్యయంతో 30 పనులు చేపట్టనున్నట్టు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంత ఉమా మహేశ్వరరావు వెల్లడించారు. మండలంలోని కొత్తపల్లి అగ్రహారం గ్రామం నుంచి నల్లాకులవారిపాలెం వరకూ రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలను ప్రధాన రహదారులతో అనుసంధానించే రోడ్ల నిర్మాణానికి ఈ నిధులను కేటాయించారన్నారు. ఈ విధంగా మండలంలోని ప్రతి గ్రామంలో ఇలాంటి లింక్ రోడ్లను గుర్తించి వాటిని సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ పనులను వేగంగా, నాణ్యంగా చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డ్వామా అడిషనల్ పీడీ రాంప్రసాద్, నాయకులు అబ్బిశెట్టి శక్తిరాజు, బండారు బాబీ, లొల్లి తాతారావు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పార్టీకి మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ రాజీనామా

నిడదవోలు: వైఎస్సార్ సీపీకి మున్సిపల్ కౌన్సిలర్లు శుక్రవారం రాజీనామా చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గంగుల వెంకటలక్ష్మితో పాటు తొమ్మిది మంది కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు వైఎస్సార్ సీపీ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు లేఖ పంపించారు.

బాలిక .. దేశ సేవిక


తుపాకీ ఫైరింగ్‌లో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

- దేశ భక్తి, ఆత్మ విశ్వాసంతో ఎన్‌సీసీలో పురోగమిస్తున్న బాలికలు
- నల్లజర్లలో కొనసాగుతున్న శిక్షణ
- బాలురకు తీసిపోకుండా ఫైరింగ్‌లో తర్ఫీదు


మంటలు అదుపు చేయడం ఎలా అనే అంశంపై క్లాస్ వింటున్న ఎన్‌సీసీ విద్యార్థినులు

నల్లజర్ల: దేశభక్తి, ఆత్మ విశ్వాసంతో పురోగమిస్తున్నారు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) విద్యార్థులు. క్రమశిక్షణ, సాహసానికి మారుపేరుగా దేశం కోసం తయారవుతున్న యువ సైనికులు వీరు. కళాశాలలు, ఉన్నత పాఠశాలల విద్యార్థులను ఎన్‌సీసీలోకి తీసుకొని ధైర్య సాహసాలు, నాయకత్వ లక్షణాలతో తీర్చిదిద్దుతున్నారు. 9,10 తరగతులు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులను ఎన్‌సీసీలో చేర్చుకుంటున్నారు. 19వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ క్యాడెట్లకు మూడు రోజులుగా నల్లజర్ల ఏకేఆర్జీ హైస్కూల్ మైదానంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈనెల 21వరకూ ఈ శిక్షణ కొనసాగుతుందని కల్నల్ అమిత్ పాండే తెలిపారు. డ్రిల్ ప్రాక్టీసు, ఆయుధాలు ఉపయోగించడం, ఫైరింగ్ అంశాలతో పాటు సేవ, ఆరోగ్య అంశాలపై ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందుతున్న మొత్తం 624 మందిలో 205 మంది బాలికలు ఉన్నారు. వారిలో గ్రామీణ నేపథ్యం గలవారే ఎక్కువ మంది. వీరంతా క్రమశిక్షణతో పాటు పోరాట విద్యలు కూడా నేర్చుకుంటున్నారు. దేశ రక్షణలో తామంతా జవానులుగా పని చేస్తామని వారంతా చెబుతున్నారు. 2026 జనవరి 16న ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే క్యాడెట్లలో కొందరిని ఇక్కడ ఎంపిక చేయనున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థినుల మనోభావాలు ఇలా ఉన్నాయి.

సేవ చేయాలనే ఉద్దేశంతోనే..



మాది పశ్చిమ గోదావరి జిల్లా గుండుగొలనుగుంట. ఏలూరులో డిగ్రీ చదువుతున్నాను. మా తండ్రి మల్లేశ్వరరావు రైతు. సేవ చేయాలనే సంకల్పంతోనే నేను ఎన్‌సీసీలో చేరాను. లోగడ జాతీయ ఉపకార వేతనానికి ఎంపికయ్యాను. వ్యాసరచన, వక్తృత్వం, భగవద్గీత వంటి పోటీల్లో పాల్గొని బహుమతులు కూడా గెలుచుకున్నాను. ప్రస్తుతం ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటున్నాను. దేశానికి సేవ చేయాలనేది నా సంకల్పం.

– తనూష, గుండుగొలనుగుంట, డిగ్రీ విద్యార్థిని

ఎన్నో విలువలు నేర్చుకున్నాను



మా స్వగ్రామం భీమడోలు మండలం మలకచర్ల. దుగ్గిరాలలో డిగ్రీ చదువుతున్నాను. మా తండ్రి ప్రసాద్ బోర్లు వేస్తుంటారు. ఇంటర్ నుంచి ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్నాను. రన్నింగ్, అథ్లెటిక్స్‌లో కూడా ప్రావీణ్యం సాధించాను. 2022, 2023 సంవత్సరాలలో ఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించి ద్వితీయ స్థానం సాధించాను. ఎన్‌సీసీలో చేరాక ఎన్నో విలువలు నేర్చుకున్నాను. నైపుణ్య శిక్షణతో పాటు భాష మీద పట్టు సాధించాను. జాతీయ శిక్షణ శిబిరంలో కూడా పాల్గొన్నాను.

– ఎం. చైతన్య, మలకచర్ల, భీమడోలు మండలం

ఎన్‌సీసీలో గర్వంగా ఫీలవుతున్నాను



మా స్వగ్రామం కామవరపుకోట మండలం ఆగడాల లంక. తండ్రి వెంకటస్వామి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎన్‌సీసీ యూనిఫాం వేసుకుంటే తెలియని ధైర్యం, ఏదైనా చేయగలమనే నమ్మకం కలుగుతుంది. శిక్షణలో సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, జాతీయ సమైక్యత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. జీవితానికి ఎంతో ఉపయోగపడే అంశాలు నేర్చుకుంటున్నాను. ఎన్‌సీసీలో చేరడం గర్వంగా ఫీలవుతున్నాను.

– యువరాణి, ఆగడాలలంక, కామవరపుకోట మండలం

ఆపద వస్తే ఎలా పోరాడాలో నేర్చుకుంటున్నా



చింతలపూడికి చెందిన నేను ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాను. తండ్రి వెంకటేశ్వర్లు స్వీపరుగా పని చేసేవారు. మృతి చెందారు. మూడేళ్లుగా ఎన్‌సీసీలో ఉంటూ ఆర్చరీలో తర్ఫీదు పొందుతున్నాను. 2023లో పంజాబ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని అర్హత సాధించాను. చదువుతో పాటు ఇతర అంశాల్లో కూడా ప్రతిభ చూపాలనేది నా ఆకాంక్ష. దేశానికి ఆపద వస్తే రక్షణకు ఎలా పోరాడాలో నైతిక విలువలు, క్రమశిక్షణతో ఇక్కడ నేర్చుకుంటున్నాను.

– పూజిత, చింతలపూడి

గ్రామస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయండి


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో సుశీల

కొవ్వూరు: గ్రామస్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో కె.సుశీల సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 2025–26లో మండల పరిషత్ అభివృద్ధి, మెరుగైన సుస్థిరాభివృద్ధి సాధన, పురోగతి, ప్రణాళికలు సాధించడం కోసం, సామర్థ్యం పెంపుదలకు ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగపరచుకోవాలని సూచించారు. మండల, గ్రామస్థాయి ప్రణాళికల తయారీపై పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, డిజిటల్ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు, డీఆర్‌డీఏ విలేజ్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్లకు ఈ శిక్షణ ఇచ్చారు. ఏపీఎస్ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ టీజీ రమణ, డీఎల్‌డీవో శ్లీవారెడ్డి, డీపీఆర్‌సీ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ ఆఫీసర్ జి.ప్రసంగిరాజు, ఎస్ఐఆర్‌డీ కన్సల్టెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

నల్లజర్ల: చారిత్రక ఆవశ్యకతతో ఏర్పడిన యూటీఎఫ్ ఎందరో నాయకుల త్యాగాలు, కృషి ఫలితంగా నేడు ఈ స్థాయిలో ఉందని ఆ సంస్థ అసోసియేట్ అధ్యక్షురాలు ఎం విజయగౌరి అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవాల కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా ఆమె హాజరయ్యారు. మహిళలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ గౌరవాధ్యక్షుడిగా పల్లి వెంకట అప్పారావు, అధ్యక్షుడిగా ఎస్ఎఫ్ అలీ అహ్మద్ అసోసియేట్ అధ్యక్షుడిగా టి.నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలిగా కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శిగా బి.కిశోర్, కోశాధికారిగా జి.కృష్ణబాలాజీ ఎన్నికయ్యారు. అలాగే ఆడిటర్‌గా ఎస్.రాంబాబు, తొమ్మిది మంది కార్యదర్శులుగా, తొమ్మిది మంది జిల్లా కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంల విజయగౌరి ప్రమాణ స్వీకరాం చేయించారు. ఎన్నికల పరిశీలకుడు సీహెచ్ మనోహర్ కుమార్, సీనియర్ నాయకులు ఐవీ సత్యం, యు.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రజకులకు విధిగా వృత్తి చెరువులు కేటాయించాలి

నల్లజర్ల: రజక వృత్తి చేసుకునే ఆ సామాజిక వర్గం వారికి జీఓ నంబర్ –343 ప్రకారం విధిగా చెరువులు కేటాయించాలని, లేకుంటే లీజుకైనా ఇవ్వాలని రజక సంఘ జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. కవులూరు గ్రామంలోని వీదులమ్మ గుడి వద్ద శుక్రవారం ఆయన సంఘస్తులతో మాట్లాడారు. ప్రభుత్వం రజకులకు కేటాయించిన చెరువులను సద్వినియోగం చేసుకోవాలని, ఇతరులకు లీజుకు ఇవ్వకూడదన్నారు. అన్ని గ్రామాలకూ చెరువులను కేటాయించినప్పటికీ, ఇంతవరకూ కవులూరు గ్రామానికి మాత్రం ఇవ్వలేదన్నారు. రజకుల కోసం 1988లో గ్రామంలోని సర్వే నంబర్ 113/2లో 77 సెంట్ల భూమిని కేటాయించగా, ఇందులో సగం భూమిని రెవెన్యూ వారు మరొకరికి కేటాయించారన్నారు. ఈ సందర్భంగా రజక సంఘం కవులూరు గ్రామశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోమటిగుంట వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సుబ్బారావు, కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా నాగేశ్వరరావు, సలహాదారులుగా సూర్యచంద్ర, శోభన్‌బాబు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కడలి సుబ్బారావు, లక్ష్మీప్రసన్న, పొట్లూరు మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్నబాబు తీర్థం


తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో వేంకటేశ్వరస్వామివారికి పుష్పాలంకరణ


వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభానికి మహిళల పూజలు

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామంలోని వెంకన్నబాబు తీర్థాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఏటా కార్తిక పౌర్ణమి నాడు ఈ తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. ఇక్కడి అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా తెల్లవారుజాము నుంచి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి, గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులతో క్యూలైన్లు రద్దీగా మారాయి. మహిళలు ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ఆబోతును కూడా భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు పెరవలి సత్యప్రసాద్, సాయి ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, గోదావరిలో చక్రస్నానం నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్తు దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. వివిధ రకాల బొమ్మల దుకాణాలు, జీళ్లు, ఖర్జూరం, రంగుల రాట్నాలు, జెయింట్ వీల్ ఏర్పాటు చేయడంతో ఆలయం ప్రాంగణమంతా కోలాహలంగా ఉంది. కై గాల సూర్యచంద్రరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. తాళ్లపూడి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్ఫటిక లింగం.. దర్శించి తరించి


ఉండ్రాజవరం మండలం పాలంగి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలా తోరణం

పెరవలి: అన్నవరప్పాడులోని ఉమా విశ్వేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం స్ఫటిక లింగ దర్శనం ఏర్పాటు చేశారు. ఈ లింగ దర్శనానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. 'హర హర మహాదేవా.. శంభో శంకరా' అంటూ పెద్ద ఎత్తున వారు చేసిన శరణు ఘోషతో ఈ ప్రాంతం మార్మోగింది. స్ఫటిక లింగం నిత్య జలాది వాసుడై ఉంటాడని పండితులు పేర్కొన్నారు. ప్రతిష్ఠ అనంతరం గుడిని పూర్తిగా నీటితో నింపి ఏడాదిలో కార్తిక పౌర్ణమి, శివరాత్రి, ప్రతిష్ఠ రోజు మాత్రమే స్వామి వారు భక్తులకు దర్శనమి స్తారని వివరించారు. రాష్ట్రంలో ఇది రెండో స్ఫటిక లింగమని పండితులు తెలిపారు.

జ్వాలాతోరణం.. నేత్రపర్వం

ఉండ్రాజవరం: కార్తిక పౌర్ణమి సందర్భంగా పాలంగి గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలోను, చివటం శివాలయంలోనూ శుక్రవారం రాత్రి జ్వాలా తోరణం వెలిగించారు. పాలంగిలో ఆప్త వాజపేయ్ మహాయాగం కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొని పూజలు నిర్వహించారు. వారిని వేద పండితులు ఆశీర్వదించారు.


అన్నవరప్పాడులో స్ఫటిక లింగ దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు


అన్నవరప్పాడులో స్ఫటిక లింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు

షెడ్ల నిర్వహణ మెరుగ్గా ఉండాలి

ఉండ్రాజవరం: సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీవో ఎస్‌పీ రామారావు, ఈవోపీఆర్డీ కె.ఆంజనేయ శర్మ సూచించారు. వడ్లూరు గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డును శుక్రవారం వారిద్దరూ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారీ, షెడ్ల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండల శానిటేషన్ కో–ఆర్డినేటర్ కత్తుల ప్రకాశ్ మాట్లాడుతూ సేకరించిన వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి కుళ్లిన చెత్తను షెడ్లలోని గదుల్లో వేసి వానసాములతో నిర్వహణ చేయాలన్నారు. తద్వారా వచ్చిన వర్మీ కంపోస్టును సేంద్రియ ఎరువుగా విక్రయించి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. జిల్లా అధికారుల సూచనల మేరకు మండలంలోని మిగిలిన పంచాయతీల కార్యదర్శులు కూడా ఈ కార్యక్రమంపై దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్తికం.. దేదీప్యమానం

- శైవ క్షేత్రాల్లో అభిషేకాలు, అర్చనలు
- అఖండ కోటి దీపోత్సవాలు
- జలాశయాల్లో దీపాలు వదిలిన మహిళలు


నిడదవోలు సోమేశ్వరస్వామి ఆలయంలో అఖండ కోటి దీపోత్సవం


పెరవలి మండలం మల్లేశ్వరంలో విశేష అలంకారంలో కపిల మల్లేశ్వరస్వామి

నిడదవోలు: కార్తిక పౌర్ణమి కావడంతో కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా శైవ క్షేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందాయి. పట్టణంలోని పురాతన రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి వార్ల ఆలయాల్లో శుక్రవారం కార్తిక పౌర్ణమి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు శివాలయాల్లో స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు. పట్టణంలోని పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డునే గల చినకాశి రేవులో వేకువనే గంగా స్నానాలు ఆచరించిన భక్తులు శైవ క్షేత్రాలకు చేరుకుని ముక్కంటి దర్శనాలు చేసుకున్నారు. స్థానిక పురాతన బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అఖండ కోటి దీపోత్సవం నిర్వహించారు. మహిళా భక్తులు సామూహిక కుంకుమపూజలు చేశారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. బ్రాహ్మణులకు దానధర్మాలు చేపట్టారు. వేద పండితుడు పొన్న కృష్ణ బాబు చెప్పిన శివపురాణం భక్తులను ఆకట్టుకుంది. గోలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించిన జ్వాలా తోరణానికి అధికంగా భక్తులు హాజరయ్యారు.కార్యక్రమంలో ఈవోలు సోమాల శివ, నామా సూర్యప్రకాశ్, అర్చకులు పాల్గొన్నారు.

పెరవలి: కార్తిక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శైవ, వైష్ణవాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. నూతన వధువులు పగలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం ఆలయాలకు వెళ్లి పూజలు చేశాక కార్తిక దీపాలు వెలిగించారు. నూతన వధువులు పసుపు మొక్క, కంద పిలక, వాయనంతో ఆలయానికి వచ్చి పూజల అనంతరం పూజారులకు తాంబూలంతో పాటు స్వయంపాకం అందించారు. మండలంలోని మల్లేశ్వరం, అన్నవరప్పాడు, కడింపాడు, పిట్టల వేమవరం గ్రామాల మహిళలు ఒక్కసారిగా రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. మహిళలు 365 ఒత్తులు వెలిగించి, అవి కొండెక్కే వరకూ భక్తి శ్రద్ధలతో శివనామ స్మరణ చేశారు.

తాళ్లపూడి: తెల్లవారుజాము నుంచి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి శివాలయాల్లో విశేష పూజలు చేశారు. ముక్కంటికి ప్రత్యేక అభిషేకాలు, పుష్పార్చనలు, కుంకుమ పూజలు, ఏకాదశ రుద్రాభిషేకాలు అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తాళ్లపూడి పార్వతీ సమేత ఉమా మహేశ్వర స్వామి, ప్రక్కిలంక విశ్వేశ్వరస్వామి, అన్నదేవరపేట సంగమేశ్వరస్వామి, వేగేశ్వరపురం చాయా సోమేశ్వరస్వామి ఆలయాల్లో సామూహిక అభిషేకాలు, గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభాల వద్ద, ఆలయాల్లోనూ మహిళలు దీపారాధనలు చేశారు. దోష నివారణార్థం బ్రాహ్మణులకు వివిధ రకాల దానాలు ఇచ్చారు. వేగేశ్వరపురంలో గోదావరి గట్టునే గల రావి, మర్రి చెట్లకు పూజలు నిర్వహించారు. పెద్దేవం, బల్లిపాడు, గజ్జరం, మలకపల్లి, తాడిపూడి, రావూరుపాడు, తిరుగుడుమెట్ట తదితర గ్రామాల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

దేవరపల్లి: కార్తిక పౌర్ణమి సందర్భంగా మహిళలు పగలంతా ఉపవాసం ఉన్నారు. సాయంత్రం శివాలయాలకు వెళ్లి పూజలు చేసి చెరువుల్లో కార్తిక దీపాలు విడిచిపెట్టారు. దేవరపల్లిలోని ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో పూజలు నిర్వహించారు.

చాగల్లు: కార్తిక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం చాగల్లు, బ్రాహ్మణగూడెం, చిక్కాల, కలవలపల్లి, మార్కొండపాడు తదితర గ్రామాల్లో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పరమేశ్వరునికి అభిషేకాలు, పుష్పార్చనలు, కుంకుమ పూజలు, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేశారు. చాగల్లు ప్రధాన కూడలిలోని రామాలయం వద్ద నిర్వహించిన లక్ష సహస్ర నామ దీపారాధనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని పలు శివాలయాల వద్ద శుక్రవారం రాత్రి జ్వాలా తోరణం వెలిగించారు.


అన్నవరప్పాడులోని కపిల మల్లేశ్వరస్వామి గుడిలో మహిళల సామూహిక పూజలు


తాళ్లపూడి శివాలయంలో భక్తుల రద్దీ


దేవరపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు